లాటరీ విధానం ద్వారా బార్లు కేటాయింపు

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో ఓపెన్ క్యాటగిరిలో బార్లను లాటరీ విధానంలో పారదర్శకంగా కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బార్ కేటాయింపు ప్రక్రియ కలెక్టర్ ఛాంబరులో గురువారం జరిగింది. బార్ కేటాయింపు కొరకు నాలుగు దరఖాస్తులు అందగా, అందరికీ నెంబర్లను కేటాయిస్తూ కలెక్టర్ లాటరీని స్వయంగా తీసి చూపించారు. దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి రూ. 20.4 లక్షలు వచ్చినట్లు జిల్లా మద్య నిషేధ, అబ్కారి శాఖ పర్యవేక్షకులు బి.జీవన్‌కిషోర్ తెలిపారు. ఈకార్యక్రమంలో సహాయ మద్య నిషేధ, అబ్కారి శాఖ పర్యవేక్షకులు ఎ.సంతోష్, ఇన్ స్పెక్టర్ వి.వి.వి.ఎస్.శేఖర్‌బాబు, ఎస్.హెచ్.ఓ జి.దాసు, మద్య నిషేధ, అబ్కారి శాఖ సిబ్బంది, దరఖాస్తు దారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవల నిలుపుదలపై అసెంబ్లీలో ప్రస్తావించాలి : సీపీఐ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/బెలగాం : ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదలపై అసెంబ్లీలో ప్రస్తావించి తక్షణ చర్యలు తీసుకొని ఆరోగ్యశ్రీ సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ కార్యవర్గ సభ్యులు ఆర్ వి ఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అనారోగ్యానికి ఆదుకొనే ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడానికి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ఇటీవల ఆరోగ్యశ్రీ సేవలు పలు ప్రైవేట్ ఆసుపత్రిలో నిలుపుదల చేయడంతో రోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు భారీగా పెరిగిపోవడంతో, ప్రైవేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ రోగులను చేర్చుకోవడానికి నిరాకరిస్తున్నా యన్నారు. ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు విడుదల కాకపోవడం, ప్యాకేజీల రేట్లు సవరించక పోవడం, బిల్లుల క్లియరెన్స్‌లో లోపాలు వంటి సమస్యలతో వైద్యసేవలు దెబ్బతింటున్నాయని ఫలితంగా జిల్లాలో రోగులు తీవ్ర ఆందోళనకు గురికావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో చర్చించి తక్షణమే నిర్ణయం తీసుకొని ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని, తక్షణం నిధులు విడుదల చేసి, ఆసుపత్రుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరుగుతుందని సేవలు నిలుపుదల చేస్తే జరిగే ప్రాణం నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి జిల్లా అధ్యక్షులు దుర్గారావు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలి

ఎంఈఓ-1 సామల సింహాచలం

విశాలాంధ్ర-బలిజిపేట : పదో తరగతి విద్యార్థులు ఇప్పటినుండే ప్రణాళికా బద్ధంగా ప్రిపేర్ అయితే మంచి ఫలితాలు సాధించవచ్చని బలిజిపేట మండల విద్యాశాఖ అధికారి 1, హై స్కూల్ స్పెషల్ ఆఫీసర్ సామల సింహాచలం అన్నారు. బుధవారం ఆయన మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా బలిజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రత్యేకం గా సందర్శించి పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. ఎఫ్ఏ-1 పరీక్షలను విద్యార్థులు ఏ విధంగా రాసింది వారిని అడిగి తెలుసుకున్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఏ సబ్జెక్టులోనైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఇంటిదగ్గర ఉదయం, రాత్రి వేళ కనీసం రెండు గంటలు చదివితే మంచి మార్కులు సాధిస్తారని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల టీచింగ్ డైరీ లను, అసెస్మెంట్ బుక్స్‌ను పరిశీలించారు. సిలబస్ ప్రకారం పూర్తి చేసి ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వి.వెంకట నాయుడు, స్టాఫ్ సెక్రటరీ నారాయణ స్వామితో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులు

విశాలాంధ్ర-సీతానగరం : అండర్ 14, అండర్ 17, అండర్ 19 కేటగిరీలో జిల్లా స్థాయి మార్షల్ ఆర్ట్స్(తంగట), ఆర్చరీ క్రీడలలో సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఆకుల. సామర్థ్ (9వ తరగతి),పలగర రంజిత్, (8వతరగతి)బొంగు భానుప్రసాద్, (9వతరగతి), సింగరోతు గౌరీశంకర్ (9వ తరగతి) విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయిని ఇల్లా. ప్రసన్నలక్ష్మి, వ్యాయమ ఉపాధ్యాయులు బోనెల చిట్టిబాబు పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు ప్రశంసించారు. ఈవిద్యార్థులు అక్టోబర్ నెలలో అనకాపల్లిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు.

వెంకటాపురంలో పొలంబడి

విశాలాంధ్ర-సీతానగరం : మండల వ్యవసాయ అధికారి ఎస్. అవినాష్ అధ్యక్షతన వెంకటాపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాలెట్ బాక్స్ టెస్ట్ పెట్టి రైతులుకి వరిలో వచ్చే తెగులు మరియు పురుగులుమీద ,మిత్రపురుగులు గురించి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం వలన లాభాలు వివరించి వాటి వలన ఆరోగ్యంగా పెరుగుతుందని, మంచి దిగుబడి వస్తుందని తెలిపారు.రసాయన ఎరువులతో పాటుగా సేంద్రియ లేదా జీవన ఎరువులను ఉపయోగించడం సమగ్ర పోషక యాజమాన్యంలో ముఖ్యమైన అంశమని తెలియచేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

డోకిశీల గిరిజన ఆశ్రమ పాఠశాలపై దర్యాప్తు చేయాలి

- ఏఐఎస్ఎఫ్ డిమాండ్.... జేసీకి వినతి
- మూడు నెలల్లో ముగ్గురు వార్డన్లు మార్పు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలోని డోకి శీల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో గత కొద్ది నెలల నుంచి ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని, మూడు నెలల్లో ముగ్గురు వార్డెన్లు మారడం, విద్యార్థులకు సక్రమంగా పౌష్టికాహారం అందించకపోవడం, ఎప్పటికప్పుడు గిరిజన విద్యార్థులు జ్వరాల బారిన పడుతుండడం చూస్తుంటే అక్కడి సిబ్బంది, వార్డెన్‌కు బాధ్యత లేనట్లు తెలుస్తుందని దీనిపై తక్షణమే స్పందించి దర్యాప్తు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రవికుమార్ అన్నారు. ఇటీవల విశాలాంధ్ర ప్రచురించిన కథనానికి ఆయన స్పందించి గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్, ఇన్చార్జ్ ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డికి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలను రవికుమార్ ఐటిడిఏ పిఓ దృష్టికి తీసుకువెళ్లారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇప్పటికి ఎక్కడలేని విధంగా కేవలం డోకి శీల ఆశ్రమం పాఠశాలలో ఎందుకు ముగ్గురు వార్డెన్లు మార్చారని, అయినా విద్యార్థుల కష్టాలు తీరడం లేదని పిఓ దృష్టికి తీసుకువెళ్లారు. వార్డెన్గా చేసి మారుస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పత్రికల్లో గిరిజన విద్యార్థుల కష్టాలపై కథనాలు వస్తే తూతూ మంత్రంగా ఆశ్రమ పాఠశాలలో సందర్శించి చేతులు దులుపుకుంటున్నారు తప్ప బాధ్యతలేని అధికారులపై, ఉపాధ్యాయులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఇదంతా కేవలం రాజకీయమా లేక అధికారుల నిర్లక్ష్య ధోరణి ప్రశ్నించారు. విద్యార్థులకు సక్రమంగా మెనూ అందడం లేదని, అలాగే సమయానికి మధ్యాహ్న భోజన పథకం అందడం లేదని వివరించారు. తప్పుడు హాజరు వేసి విద్యార్థుల పేరుపై వేల రూపాయలను వార్డెన్లు దోచుకుంటున్నారని దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పత్రికలో వస్తున్న కథనానికి పరిగణలోకి తీసుకొని బాధ్యత లేని పై చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం : ఏఈ

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలోని నర్సిపురం సబ్ స్టేషన్ పరిధిలో గల పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగునని మండల విద్యుత్ శాఖ ఏఈపి రామారావు తెలిపారు. శాఖా పరంగా నర్సిపురం 11 కె.వి ఫీడర్లో గ్రామాలకు అనుసంధానం చేసే విద్యుత్ లైన్లు చెట్లు తొలగింపు, మరమ్మత్తులు జరుగుతాయని ప్రజలు సహకరించాలని కోరారు. ఈ పనులు మూలంగా వైకేయం కాలనీ, వెంకంపేట, అఫీషియల్ కాలనీ, వసుంధర నగర్ తో పాటు పలు గ్రామాలకు విద్యుత్ ప్రచారానికి అంతరాయం వాటిల్లుతుందని అన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-కురుపాం : కురుపాంలో నిర్మాణంలో ఉన్న జెఎన్టియు గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం పనులు తక్షణమే పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఇంజనీరింగ్ కళాశాల నిర్మణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ గత ఏడాదిన్నర కాలంగా పనులు జరగడం లేదని వివరించారు. కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ లు,చొరవ తీసుకుని నిర్మాణం పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికైనా తరగగతులు, కళాశాల ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పార్వతీపురం లో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు. పార్వతీపురంలో ఏర్పాటు చేయనున్న మెడికల్ కాలేజీ "పీపీపీ" విధానం లో కాకుండా ప్రభుత్వమే పూర్తిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. "పీపీపీ"విధానంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తే వైద్య విద్య, వైద్య సేవలు మరింత ఖరీదుగా మారి పేదలకు దూరం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమం సంఘం నాయకులు పాలక మల్లేష్ ఉన్నారు.

ఆడలి వ్యూపాయింట్ అభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర-సీతంపేట : పర్యాటక ప్రాంతమైన ఆడలి వ్యూ పాయింట్‌ను ఐటీడీఏ పీఓ సిప్నల్ పవర్ జగన్నాథ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పివో మాట్లాడుతూ వ్యూ పాయింట్ చాలా బాగుందని, వ్యూ పాయింట్ నుంచి ప్రకృతి అందాలు చాలా సుందరంగా కనిపిస్తున్నాయన్నారు. వ్యూ పాయింట్ ను మరింత అభివృద్ధి చేయుటకు చర్యలు తీసుకుంటామన్నారు. వ్యూ పాయింట్ రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగభూషణ్, డిపివో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలి

ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, నాణ్యమైన మెనూ అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన కొనసాగించాలని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. గురువారం ఆయన సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాల మరియు శంభాం బాలుర ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అన్ని తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ వారి అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు వసంత లక్ష్మి, హెచ్ డబ్ల్యు ఓపి అమల, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని రెండు ఎడ్లు మృతి

విశాలాంధ్ర-సీతానగరం : గురువారం ఉదయం జగ్గునాయుడుపేట గ్రామం నుంచి ఇసుక తీసుకొని వెళ్లడానికి సీతానగరం నాటుబండ్లు వస్తుండగా సదరు రెండునాటుబండ్లను పార్వతీపురం వైపునుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న ఒక లారీ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా డ్రైవ్ చేసి రాష్ట్రీయరహదారిపై కాశాపేట పెట్రోల్ బంకుకు ఎదురుగా ఢీకొనడంతో సదురు రెండునాటుబండ్లకు చెందిన రెండు ఎడ్లు మృతి చెందాయి. తిరుపతిరావు, పెంట పోలినాయుడులకు చెందిన రెండు ఎద్దులు కూడా సంఘటనా స్థలంలోనే దెబ్బలతో చనిపోయాయి.ఇదే ఆక్సిడెంట్ లో రెడ్డి తిరుపతిరావుకి చిన్న చిన్న దెబ్బలు తగలడంతో అతను పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెడ్డి తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర-మోతుగూడెం : రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు దశల వారి ఆందోళనలో భాగంగా గురువారం మోతుగూడెం చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నాయకులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు నిరసన తెలియజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహించే కాంట్రాక్ట్ కార్మికులకు ఏజెన్సీ అలవెన్సులు మంజూరు చేయాలని,ఏపీ జెన్కోలో ఖాళీగా ఉన్న ఇళ్లను కాంట్రాక్టర్ కార్మికులకు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలు విలీనం చేయాలని, సుప్రీం కోర్టు ఆదేశానుసారం సమాన పనికి సమాన వేతనం అమలుచేయాలని, మూడు దశాబ్దాల నుంచి ఏజెన్సీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఏపీ జెన్కో సంస్థను నమ్ముకుని 60 సంవత్సరాలు వయసులో రిటార్డ్ అవుతున్న కాంట్రాక్టర్ కార్మికులకు గ్రాడ్యుటీ ఇప్పించాలని, ఇలా వివిధ అంశాలపై తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయాలని నినాదాలు చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం : ఎంపీపీ ఈశ్వరి

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : పరిసరాల పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యమని మండల ఎంపీ పీ బాగా ఈశ్వరి అన్నారు. మండలంలోని సోవ్వ పంచాయితీ కమలబంధ గ్రామంలో సానిటేషన్ పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తడి చెత్త పొడి చెత్త సేకరణ పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మండలం ఎంపీపీ ఈశ్వరి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత తోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, ప్లాస్టిక్ వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు వారి వారి యొక్క నివాస గృహాలు చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. చెత్త చెదారాల వల్ల అనేక రకాల దుర్వాసనలు వెదజల్లి అనారోగ్యానికి గురి అయ్యే ప్రమాదం ఉంటుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో అరకు అసెంబ్లీ వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి పాంగి నరసింగారావు, పంచాయతీ మహిళా పోలీస్ నాగసుమంజలి, ఆశ వర్కర్ ఉష, అంగన్వాడి టీచర్ రాధ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నంలో హ్యూమన్ రైట్స్ కమిషన్ పర్యటన

పాల్గొన్న పిఓ, సబ్ కలెక్టర్ ఉన్నత అధికారులు

విశాలాంధ్ర-దేవీపట్నం : అల్లూరి జిల్లా రంపచోడవరం దేవీపట్నం మండలంలో పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయభారతి సయని వెల్లడించారు దేవీపట్నం మండలం కమలం పాలెం పునరావాస కాలనీలో, పోలవరం నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రంపచోడవరం పిఓ స్మరణ్‌రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు ఇంద్రజిత్ కుమార్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా నిర్వాసితుల సమస్యలను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన వాటిని రికార్డ్ చేసుకున్నారు. నిర్వాసితులు చెప్పిన సమస్యలపై రెండు నెలలలోగా పూర్తి చేస్తామని అధికారులు తెలియపరిచారు. అనంతరం విజయ భారతి శయని మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజి అందిందా లేదా గృహ నిర్మాణాలు పూర్తి అయ్యాయా లేదా భూమికి భూమి కేటాయించార లేదా అనే విషయాలను తెలుసుకోవడం జరిగిందని వాటికి సంబదించిన అధికారులు పూర్తిగా సహకరించారని తెలిపారు. త్వరలోనే నిర్వాసితులందరికి న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కే సత్యనారాయణ, ఎంపీడీవో కే సాల్మన్ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, ఎస్ఐ కె.షరీఫ్, మండల అధికారులు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ ఒకరు మృతి

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లి నర్సీపట్నం ప్రధాన రహదారిలోని లంబసింగి కొండ రహదారి (ఘాటీ)లో గురువారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం నర్సీపట్నం నుంచి స్వగ్రామమైన లంబసింగి వస్తున్న బిజెపి నాయకుడు, పంచాయతీ వార్డు సభ్యుడు వాడకాని రాజ్‌కుమార్(50)ను చింతపల్లి నుంచి లంబసింగి మీదుగా నర్సీపట్నం వెళుతున్న మరో ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో రాజ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన రాజ్ కుమార్‌ను హుటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుది శ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు రాజ్‌కుమార్‌కు వివాహం కాలేదని, లంబసింగి శివాలయంలో అర్చకునిగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

చూడముచ్చటగా ఏడు రంగుల ఇంద్ర ధనుస్సు చిత్రాలు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : కేంద్రం పాడేరులో ఏడు రంగుల ఇంద్ర ధనుస్సు గురువారం సాయంత్రం కనిపించింది. పర్యాటకులు ఈ చిత్రాన్ని తమ ఫోన్' కెమెరాల్లో బంధించడానికి ఎగబడ్డారు.

ఆది కర్మయోగి సేవా కేంద్రాన్ని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: పాడేరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ లో జిల్లా ఆది కర్మయోగి ఆది సేవా కేంద్రన్ని ఐటీడీఏ పిఓ తిరుమణి శ్రీపూజ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గిరిజన సమాజానికి శక్తివంతమైన వికేంద్రీకృత న్యాయకత్వ పాలనావ్యవస్థను నిర్మించడమే ప్రధాన ఉద్దేశమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అమలు చేయుటలో సమన్వయం కోసం ఆది కర్మయోగి కార్యక్రమం ముఖ్య ఉదేశ్యం అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా శాశ్వతమైన అమలు ప్రక్రియ, ప్రభుత్వ నిర్ణయాలు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఆది కర్మయోగి పథకం గ్రామస్థాయి అభివృద్ధికి సూక్ష్మ ప్రణాళికలు తయారుచేసి తద్వారా వివిధ విభాగాల సమన్వయంతో ప్రణాళిక అమలుపరిచి గిరిజన గ్రామాల సర్వతో ముఖాభివృద్ధి సాధించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించి తద్వారా గ్రామస్థాయి న్యాయకత్వాన్ని బలోపేతం చేస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ సేవా కేంద్రంలో ఆదివాసి గ్రామాల సమస్యల పరిష్కారంలో ఫిర్యాదులను పరిష్కరించడం ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. సదరు ఫిర్యాదులు వివిధ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తుంది. ఇలాంటి సేవా కేంద్రం మండలంలో సచివాలయంలో గ్రామస్థాయిలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాని పర్యవేక్షించడానికి జిల్లా నోడల్ ఆఫీసర్‌గా కె.రాజేష్‌బాబు, పీఎంయు, ట్రైబల్ వెల్ఫేర్ నియమించడం జరిగిందన్నారు.

ఈనెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణు గోపాలరావు

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లి, గూడెం కొత్తవీది మండలాల్లో ఈనెల 20వ తేదీన విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వేణు గోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు చింతపల్లి ఏజెన్సీలోని గూడెం కొత్తవీది మండలంతో పాటు, చింతపల్లి మండలం లోని అన్ని గ్రామాలకు ఈనెల 20న(శనివారం) విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 33 కేవి చింతపల్లి ఫీడర్ నందు విద్యుత్తు మరమ్మత్తు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ సంద ర్భంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల్లోని అన్ని గ్రామాల ప్రజలు విద్యుత్ శాఖతో సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఒకే రోజు మూడు కాలాలు!

గిరిజన ప్రాంతంలో వింత వాతావరణం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతంలో గత రెండు రోజులుగా వింత వాతావరణం నెలకొంది. చలికాలం రాక ముందే గురువారం ఉదయం నుంచి 10 గంటల వరకు దట్టమైన పొగ మంచు కమ్మి జనాలకు ఉక్కిరిబిక్కిరి చేసింది. క్రమేపి 4 గంటల వరకు ఎండ తీవ్రంగా పెరిగింది. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు అక్కడకడ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఎండ తీవ్రతతో అల్లాడిన జనాలకు ఒక్కసారిగా ఉపశమనం కలిగించింది. కుండపోత వర్షం కారణంగా కొంత రైతులకు ఇబ్బందులు ఏర్పడింది. పంట పొలాలు నీరు తో నిండి పోయింది. వాస్తవానికి ఇప్పుడు వర్ష కాలం ఉన్నపటికీ ఉన్నట్టుండి. ఒకే రోజు మూడు కాలాలు ఏర్పడడం ఒకంత ఆశ్చర్యాన్ని కలుగజేసింది. ఈ తరహా పరిస్థితులు ఏజెన్సీ ప్రాంతంలో ఒక్కోసారి చోటు చేసుకుంటుందని, ఒకే రోజు మూడు కాలాలు వింత వాతావరణం ఏర్పడిందని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

నార్కోటిక్ అక్రమ రవాణాను చేధించిన ఎక్సైజ్ పోలీసులు

- 30 కేజీల హాషీష్ ఆయిల్, 11:30 కేజీల ఎండు గంజాయి స్వాధీనం
- ఇరువురు అరెస్ట్... మరో ఇరువురు పరార్
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కూర్మారావు

విశాలాంధ్ర-చింతపల్లి : నార్కోటిక్ అక్రమ రవాణాను స్థానిక ఎక్సైజ్ పోలీసులు చేదించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడంలో, ముఖ్యంగా యువతను మత్తుపదార్థాల ముప్పు నుంచి రక్షించడంలో భాగంగా ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ మహేష్ కుమార్, అల్లూరి జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ జి గౌరీశ్వరరావు ఆదేశాల మేరకు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె. కూర్మారావు ఆధ్వర్యంలో ఆ శాఖ సబ్ ఇన్స్పెక్టర్లు వై. చైతన్య, ఎన్. రాంబాబు సహా హెడ్ కానిస్టేబుళ్ల కె.రమేష్, డి .కుమార్, కానిస్టేబుళు ఆర్.డి.నాయుడు, డి.రవితేజ, జి. చంద్రరావు, జి. శివ, కె.అనంతలక్ష్మిలతో పక్కా సమాచారం మేరకు కొత్తపాలెం పంచాయతీ కొత్త బంధ గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులలో 30 కేజీల హాషీష్ ఆయిల్, 11.50 కేజీల పొడి గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటితో సంబంధం ఉన్న అదే గ్రామానికి చెందిన కొర్ర సోమర(35)తో పాటు మల్కన్ గిరి జిల్లా చిత్రకొండ సబ్ డిస్ట్రిక్ట్, రాళ్లగడ్డ సమీపంలోని సరుకు బంధ గ్రామానికి చెందిన కిల్లో చంద్ర (18) లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేయడం జరిగిందన్నారు, అదేవిధంగా దీనితో సంబంధం ఉన్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మల్కన్ గిరి జిల్లా చిత్రకొండ ప్రాంతానికి చెందిన మరో ఇరువురు కిల్లో ప్రసాద్, కొర్ర లోకేష్ లు పరారీలో ఉన్నారని వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ కేసుకు సంబంధించి మూడు ద్విచక్ర వాహనాలతో పాటు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు అరెస్ట్ అయిన నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ కూర్మా రావు తెలిపారు.

అంబులెన్స్ లేక పాప మృతి..!

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్
- అంబులెన్స్ మంజూరుకు డిమాండ్

విశాలాంధ్ర-జీకే విధి : జీకే వీధి మండలంలోని పెదవలస పంచాయతీకి చెందిన బొంతవలస గ్రామంలో మంగళవారం జరిగిన విషాదకర సంఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. గ్రామానికి చెందిన మర్రి కవిత కుమార్తె ఆకస్మికంగా అస్వస్థతకు గురై, సమీప పిహెచ్సీలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయింది.ఈ సంఘటన నేపథ్యంలో స్థానిక సర్పంచ్ కృష్ణవంశీ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి మానసిక దుఃఖాన్ని పంచుకున్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి సంఘటనకు కారణాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పెదవలస పిహెచ్సి పరిధిలో మొత్తం 35 గ్రామాలు ఉన్నాయి. అలాంటి స్థలంలో శాశ్వత అంబులెన్స్ లేకపోవడం చాలా బాధాకరం. ఈరోజు పాప ప్రాణం పోయింది, రేపు ఇంకెవరో బాధితులవుతారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి పెదవలస పిహెచ్సికి శాశ్వత అంబులెన్స్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్‌రావు, దొరబాబు, త్రినాధులు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్దఎత్తున హాజరై బాధిత కుటుంబానికి సానుభూతి ప్రకటించారు.

ఐఈసి సమావేశానికి సోమశేఖరరావు మాస్టారు ఎంపిక

విశాలాంధ్ర-సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బయలాజికల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న సోమశేఖరరావు గంట న్యూఢిల్లీలో ఈనెల 15నుండి 19వరకు జరగనున్న ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నిక్ సాధారణ సమావేశంలో పాల్గొంటారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి తెలిపారు. పాఠశాలలో సోమ శేఖరరావు మాస్టర్ బిఐఎస్ మెంటార్ గా పలుఅంశాలను బోధిస్తున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి న్యూఢిల్లీ వెళ్లడానికి తొమ్మిది మందిని ఎంపిక చేయగా, అందులో సోమశేఖరరావు మాస్టారు ఒకరని తెలిపారు. ఆయనకు హెచ్ ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, స్టాఫ్, విద్యార్థులు అభినందనలు తెలిపారు. తనకు అవకాశం కల్పించిన విజయవాడ బిఐఎస్ అధికారులకు, హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మికు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

డ్రోన్‌తో జీవామృతం, కషాయాలు స్ప్రేయింగ్

విశాలాంధ్ర-పార్వతీపురం : మండలంలోని చినబొండపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రభందకులు మూడడ్ల శ్రావణ్ కుమార్ నాయుడు, మండల వ్యవసాయ అధికారి అశోక్ ఆధ్వర్యంలో ద్రవజీవామృతం బి.దేవిప్రసాద్ పది ఎకరాల వరి పొలంలో డ్రోన్‌తో స్ప్రేయింగ్ చేయించడం జరిగినది. ఈసందర్భంగా డిపిఎం శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ద్రవజీవామృతం స్ప్రే చేయడం వలన పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు లభించడంతో పాటు, ట్రైకోమ్‌లు పెరగడం వలన మొక్కకు కావలసిన గరుకుతనం వచ్చి, చీడపీడల నివారణకు ఉపయోగపడుతుందని, వ్యవసాయ కూలీల ఖర్చు అధికంగా ఉన్న ఈతరుణంలో డ్రోన్‌ను ఉపయోగించడం వలన రైతు సమయంతో పాటు ఖర్చు కూడా ఆదావుతుందన్నారు. కావున రైతులు టెక్నాలజీ మరియు మెషినరీ వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎన్ఎఫ్ఎ తిరుపతిరావు, మాస్టర్ ట్రైనర్ శ్రీరామ్ , యూనిట్ ఇంచార్జి గంట తవుడు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : కొల్లాపూటు పంచాయితీ పరిధిగల బిట్రగండ, బలియాగూడ,నందివలస, మున్నిగూడ, చంపగుడ తదితర గ్రామాలలో ఉన్న పశువులకు, గేదెలకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం గ్రామాల్లో సందర్శించి పశువులకు,గేదెలకు, గాలికుంటు వ్యాధి నిరోధిక టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ పి.రామ్మూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ బి.ధర్మ మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన దూడ పేయ్యను కూడ తప్పనిసరిగా టీకాలు వెయ్యాలన్నారు. వచ్చేనెల 15వ తేదీ వరకు ఉచితంగా టీకాలు వేస్తామన్నారు.పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం రావటం, నోటి నుండి తీగల వలె సొంగ రావటం,కాళ్ల గిట్టల మధ్య పుండ్లు, తదితర వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులలో మరణాలు నివారించి ఆరోగ్యంగా ఎదగడానికి ఈ టీకాలు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. తొలిరోజు ఐదు గ్రామాలకు మొత్తం 625 పశు వులకు గేదెలకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీం వర్క్‌తో పలు సచివాలయల వెటర్నరీ అసిస్టెంట్లు, వార్డు సభ్యుడు బి. సుందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడకు చేరుకున్న యుటిఎఫ్ రణభేరి

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈనెల 15 ఉత్తరాంధ్ర శ్రీకాకుళం జిల్లా నుంచి యుటిఎఫ్ చేపట్టిన రణభేరి జాత గురువారం మండల కేంద్రంలో చేరింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కిషోర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధన పని తప్ప మిగిలిన బోధనేతర పనులు కల్పించమని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీనిచ్చిందన్నారు. అయితే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా విస్మరిస్తుందని విమర్శించారు గత వైసిపి ప్రభుత్వం కల్పించిన బోధ నేతర యాప్ లను కల్పించకుండా ఒకే యాప్ ను పెడతామని చెప్పి, ఆ ఒకే యాప్ లో అన్ని రకాల పనులకు సంబంధించిన బోధనేతర యాప్ లను జత చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేట్ ఫారం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర పడుతుందనిఆయన విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి యుటిఎఫ్ పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు. దీనిపై ప్రతి ఒక్కరు స్పందించి పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విబి మహేశ్వరరావు, జిల్లా నాయకులు కే రఘునాథ్, ఎస్ కన్నయ్య, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ బాలకృష్ణ, అసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జంఝావతి సమస్యపై అసెంబ్లీలో చర్చించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో జంఝావతి ప్రాజెక్ట్ విషయాన్ని పూర్తిగా చర్చించి ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు, తాగునీరు అందించాలని, ఒరిస్సాలో బీజేపీ ప్రభుత్వం, ఆంధ్రాలో బీజేపీ అనుబంధ ప్రభుత్వం ఈ రెండు ప్రభుత్వాలు కలిసి జంఝావతి ప్రాజెక్టును పూర్తిచేయాలనీ సిపిఐ (ఎమ్ ఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేసారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో కూటమి ప్రభుత్వం చర్చించి ప్రజల సందేశాలను నివృత్తి చేయాలన్నారు. జంఝావతి ప్రాజెక్ట్ ను ఎప్పుడు పూర్తి చేస్తారో ప్రజలకు చెప్పవలిసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తికాకపోవటంతో ఈ ప్రాంతం వెనుకబడి ఉందన్నారు. ప్రాజెక్టు పూర్తికాక, వర్షాలు సకాలంలో కురవక, వ్యవసాయం లాభాదాయకంగా లేకపోవడంతో జంఝావతి ఆయకట్టు ప్రాంతాలకు చెందిన రైతులు వ్యవసాయానికి దూరమయ్యారన్నారు. ఒడిశా సమస్య సాకుతో అర్థ శతాబ్ద కాలంగా ఇక్కడ రైతులను మోసం చేయడం అన్యాయమన్నారు. ప్రస్తుతం కేవలం సుమారు 3, 4 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు ఇచ్చే దుస్థితి ఉందన్నారు.ఇది కూడా కాకి లెక్కలే అధికారులు చెబుతున్నారని ఆరోపించారు. లిఫ్ట్ అందుబాటులోకి తీసుకురాలేని, పూడికలు కాలువల్లో తీయలేని, గుర్రపు డెక్క తొలగించలేని దుస్థితిలో అధికారులు, పాలకులు ఉన్నారని ఎద్దేవా చేశారు.లిఫ్ట్ ఇరిగేషన్ పనిచేసేలా పాలకులు అధికారులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్న విషయాన్ని మర్చిపోరాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎమ్ఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, ఏ.సీతమ్మ, బొత్స మోహన్‌రావు, జి.జనార్ధన్, ఏ.సీతమ్మ, జిల్లా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత రహదారుల కల్పనే కూటమి లక్ష్యం

ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : డోలీ మోత రహిత గ్రామాలే లక్ష్యంగా శాశ్వత రహదారుల కల్పనకు కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర అన్నారు. మండలంలోని గుంటసీమ రోడ్డు నుంచి తద్దా వరకు మంజూరైన బీటీరోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కూటమి శ్రేణులతో కలిసి కొబ్బరికాయను కొట్టి శంకుస్థాపన చేశారు. రూ. 2.90కోట్లతో బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, నాణ్యత ప్రమాణాలతో రోడ్డును నిర్మించి గిరిజనుల కాలినడక కష్టాలు తీర్చాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆ గ్రామస్థులతో ఆయన మాట్లాడ్లారు. డోలీ మోతల నివారణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శాశ్వత రహదారుల కల్పనకు రూ. 1000కోట్లు కేటాయించిన ఘనత కూటమికే దక్కుతోందన్నారు. గత ప్రభుత్వం గిరిజన ప్రాంత అభివృద్ధిని విస్మరించిందన్నారు. 15 నెలల కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్న ఘనత కూటమికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో భాగస్వాములై రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి దన్నుగా నివాలని ఆయన కోరారు. అరకులోయ నియోజకవర్గ మార్కె కమిటీ చైర్మన్ లక్ష్మీ, మండల అధ్యక్షుడు ఆనందరావు, పీఏసీఎస్ చైర్మన్ సుబ్బారావు, నాయకులు దన్నెరావు, సుబ్బారావు, స్వామి, భాస్కరరావు, గెన్ను, జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం ప్రధానం : జిల్లా ఉప వైద్యాధికారిణి పద్మావతి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామస్థాయిలోనే అమలు చేస్తున్న స్వస్థనారి స్వసక్తి పరివార్ ద్వారా మహిళలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకొని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ పద్మావతి సూచించారు. నిత్యం ఇల్లు, పిల్లలు, కుటుంబం, సంసార బాధ్యతలు అనే ఆలోచనలో పడి స్త్రీ మూర్తులు వారి యొక్క వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకోలేకపోతున్నారని, దీని మూలంగానే చాలా వరకు మహిళలు అనేక వ్యాధులు గురవుతున్నారని అన్నారు. మండలంలోని పెద్ద బండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కృష్ణ పల్లి గ్రామంలో ఉన్న సబ్ సెంటర్ ను గురువారం ఆమె సందర్శించారు. సబ్ సెంటర్ పరిధిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వస్థనారి స్వశక్తి పరివార్ పర్యవేక్షించారు. మహిళలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఇస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యం కోసం వస్తున్న రోగుల యొక్క పూర్తి వివరాలు ఆన్లైన్ చేసుకోవాలని ,గర్భిణీలు సక్రమంగా నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఎనీ మియా లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ఆమెతోపాటు వైద్యురాలు ధరణి, సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు మహిళలు ఉన్నారు.

స్వస్తినారి స్వస్తిక్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-బలిజిపేట : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి ప్రారంభించిన స్వస్తినారి స్వస్తిక్ పరివార్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా నేటి నుండి అక్టోబర్ 2 వరకు వైద్య సేవలను మహిళల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి వై విజయ మోహన్ తెలిపారు మహిళలే ఈ సమాజానికి పునాదులని వారి ఆరోగ్యం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయని ప్రతి మహిళ తన ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉంటే అనారోగ్య సమస్యలు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకుంటారని తెలిపారు మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తే అనవసర ఖర్చులు తగ్గుతాయని తద్వారా డబ్బులు ఆదా అవుతుందని సూచించారు. అక్టోబర్ 2 వరకు జరిగే ఈ వైద్య సేవలలో మహిళలకు అన్ని టెస్టులు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు మందులు కూడా ఉచితముగా ఇస్తామన్నారు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఈ ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవాలని కోరారు. ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మహిళలకు కిషోర్ బాలికలకు రక్త పరీక్షలు బీపీ షుగర్ పరీక్షలు దంత పరీక్షలు 123 మందికి పరీక్షలు జరిపారు వైద్య సిబ్బందికి అంగన్వాడి సిబ్బందికి వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. గర్భిణీలకు బాలింతలకు హిమోగ్లోబిన్ శాతం పెంచుకోవాలని వై విజయ మోహన్ తెలిపారు ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ నిహారిక చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ స్నిగ్ధ దంత వైద్య నిపుణులు డాక్టర్ రమ్య రోగులను తనిఖీలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండల వైస్ ఎంపీపీ వెలిది సాయిరాం గ్రామ సర్పంచ్ రాగలత బలిజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం మాధురి మరియు జడ్పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్ వైసీపీ పార్టీ అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ పాల్గొన్నారు.

దుంబ్రిగుడ : మహిళలు బాగుంటునే ఇంటిల్లి పాదితో పాటు సమాజాం బాగుంటుందని సర్పంచి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత అన్నారు. మండల కేంద్రం దుంబ్రిగుడలో స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళల వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. క్యాన్సర్, రక్తహీనత, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలనే నిర్వహించి, వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి రాంబాబు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీలేరు : జీకేవీధి మండలం సీలేరు గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలలో స్వస్త్ నారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ హెూమియో వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ బి.సృజనరాయ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ సూపర్ వైజర్ యన్.త్రినాథ్ ఆధ్వర్యంలో ఆడ పిల్లలు అందరికీ రక్తహీనత, నెలసరి సమయంలో శుభ్రత పైన నెలసరులు సక్రమంగా రాని వారిని పరీక్షించి నెలసరి సమయంలో తీసుకో వలసిన జాగ్రత్తలను వివరించారు. పీరియడ్స్ క్రమం గూర్చి వివరించి, పి సిఓడి సమస్య పై అవగాహన కల్పించారు. నీరసం, తలనొప్పి, తల తిరగడం, అధిక రక్త స్రావం ఇటువంటి లక్షణాలు ఉన్నట్లయితే అశ్రద్ధ చెయ్యకుండా వెంటనే దగ్గరలో ఉన్న హాస్పిటల్ కు వెళ్ళి వైద్యులకు చూపించుకోవాలని, సక్రమమైన పోషక ఆహారం లో భాగంగా మన పేరడీ లో మరియు చుట్టు వక్కలలో దొరికే తాజా మునగాకు, బచ్చలి, పొన్నగంటి గుమ్మడి చిగుర్లు, తోట కూర మొదలగు తాజా ఆకుకూరలు ప్రతిరోజు విడిగా కానీ వప్పులో కలిపిగానీ తీసుకోవాలన్నారు. తాజా ఫలాలు బెల్లంతో తయారుచేసిన చెక్కులు, నువ్వు పప్పు ఉండలు, పాలు, ఉడకబెట్టిన గుడ్లు ప్రతిరోజు తీసుకోవాలని, ప్రతి రోజు 4లీటర్ల మంచి నీరు త్రాగాలని, ఆడ పిల్లలు బలంగా ఉన్నప్పుడే బలమైన కుటుంబం ఉంటుందని, ఆడపిల్లలు అందరూ పై విషయాలు పాటించిన రోజు ఎంతో ప్రయాసపడి రూపొందించిన స్వస్త్ నారీ సశక్త పరివార్ అభియాన్ ప్రోగ్రామ్ విజయవంతం చేసినవారము అవుతామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీలేరు గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల వార్డెన్ పి.శకుంతల,

ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవనోపాధి పెంపొందింపులో తేనెటీగల పెంపకానిది ముఖ్య పాత్ర

ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం తేనెటీగల పెంపకం ద్వారా గిరిజనులకు ఆర్థిక ఉపాధి
హనీ మిషన్ నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర-చింతపల్లి : తేనెటీగల పెంపకంలో మెలకువలు తెలుసుకోవడం ద్వారా గిరిజనుల జీవనోపాధి పెంపొందించుటలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వీట్ కార్న్ ఉద్యమం ద్వారా ఆత్మ నిర్భర్ భారత్ అనే కార్యక్రమం ద్వారా తేనె ప్రాసెసింగ్ యూనిట్‌పై పది రోజుల శిక్షణా తరగతులను లంబసింగి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధ, గురువారాలలో ప్రారంభించడం జరిగిందని హనీ మిషన్ నోడల్ అధికారి డి సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బుధవారం లంబసింగి ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోనూ, అదే క్రమంలో గురువారం లంబసింగిలోను రెండు బృందాలకు శిక్షణ తరగతులను ప్రారంభించడం జరిగిందన్నారు. 10 లక్షల రూపాయల ఈ ప్రాజెక్ట్‌లో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ద్వారా అందించే ఈ శిక్షణ ఉచితమన్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో తేనే పెట్టెలు ఎలా పెంచాలి, తేనె ఎలా సేకరించాలి, దానిని ఏ విధంగా మార్కెటింగ్ చేసుకోవాలి అనే దానిపై 20 మంది చొప్పున రెండు గ్రూపులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. తేనె పెట్టెను లైవ్ ద్వారా తీసుకువచ్చి ఎంపికైన సభ్యులకు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇవ్వడం జరుగు తుందన్నారు. పది రోజులపాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో తేనెటీగల పెంపకం పై అనేక మెలకోలు నేర్చుకునే అవకాశం ఉందన్నారు. తేనెటీగల పెంపకం వలన రైతులకు ఆదాయం మెరుగుపడుతుందన్నారు. పూత అభివృద్ధి చెందే దశలో తేనె దిగుబడి పెరిగి రైతులకు అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. శిక్షణ అనంతరం ఒక్కొక్క సభ్యునికి సుమారు 60 నుంచి లక్ష రూపాయల విలువచేసే విధంగా ఒక్కొక్కరికి 10 తేనె పెట్టెలను అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నామన్నారు. ఈ సదవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శాంతి కుమారి, కాఫీ బోర్డ్ మరియు అగ్రికల్చర్ సిబ్బందితోపాటు ఐ ఐ ఎం ఆర్ కో ఆర్డినేటర్, తేనెటీగల ప్రాసెసింగ్ మాస్టర్ ట్రైనర్ రమేష్, లంబసింగి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సీఈఓ రాజేష్, సభ్యురాలు ఇందిర, అధిక సంఖ్యలో రైతులు, హనీ మిషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగానే బంగారు కుటుంబాల దత్తత

విశాలాంధ్ర-పార్వతీపురం: స్వచ్ఛందంగానే బంగారు కుటుంబాల దత్తత ఉంటుందని, మార్గదర్శి నిర్ణయమే ముఖ్యమని జాయింట్ కలెక్టర్ సి. యస్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ పి4 బంగారు కుటుంబాల దత్తతపై జిల్లా ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాల దత్తతకు మార్గదర్శకులు ముందుకు రావాలని కోరారు. ఇందులో ఎటువంటి ఒత్తిడి లేదని వారు స్వచ్ఛందంగా, ఇష్టపూర్వకంగానే రావచ్చన్నారు. అలాంటి వారినే మార్గదర్శిగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మార్గదర్శులకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి జాయింట్ కలెక్టర్ సూచించారు. మార్గదర్శిల ఎంపికకు ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసిందని, దానిని తూ.చ తప్పకుండా పాటించాలన్నారు. ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు ఇలా అన్ని వర్గాల్లోని వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దత్తత తీసుకోవచ్చని పిలుపునిచ్చారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శులకు ముందుగానే అవగాహన కల్పించాలని అన్నారు. మార్గదర్శుల వల్ల బంగారు కుటుంబాల్లో చిన్న మార్పు వచ్చినా వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తుందని జేసీ తెలిపారు. ఉద్యోగ బాధ్యతలతో పాటూ సామాజిక స్పృహ కూడా ఉండాలని హితావు పలికారు. బంగారు కుటుంబాలకు - మార్గదర్శుల

మధ్య ఇబ్బందులు కలిగితే పరస్పరం మాట్లాడుకుని పరిష్కరించుకునేలా కృషి చేయాలని సూచించారు. బంగారు కుటుంబాలకు ఆర్థికంగా లేదా ఇతర సహాయ సహకారాలను అందించి మార్గదర్శి ఆదుకోవచ్చని, ఈ విషయంపై మార్గదర్శికి అవగాహన కల్పించి వారి పేర్లను పీ4 నందు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఒకరు ఒక కుటుంబాన్నే కాకుండా ఎన్ని కుటుంబాలనైనా లేదా ఆర్థిక స్తోమతను బట్టి గ్రామాలను కూడా దత్తత తీసుకోవచ్చని తెలిపారు. దత్తత తీసుకోబోయే మార్గదర్శిలకు కొన్ని సందేహాలు ఉంటాయని, వాటిని నివృత్తి చేసి, ఇష్టపూర్వకంగా ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి తెలిపారు. ఈసందర్భంగా సిబ్బందికి కలిగిన అనుమానాలను జేసీ నివృత్తి చేశారు. ఈ శిక్షణా తరగతుల కార్యక్రమంలో జిల్లా ప్రణాళికాధికారి ఎస్.ఎస్.ఆర్.కె. పట్నాయక్, స్టాటిస్టికల్ రాష్ట్ర పరిశీలకులు లతీఫ్, రాష్ట్ర శిక్షకులు శ్రీనివాస్, జిల్లా ప్రణాళికా కార్యాలయ సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, జిల్లాలోని సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

విశాలాంధ్ర పార్వతీపురం టౌన్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ పకీరునాయుడుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా, పట్టణ అధ్యక్షులు సిహెచ్ సింహాచలం, ఎన్.శంకర్రావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తుందని, గత ప్రతిపక్షంలో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, నేడు పూర్తిగా దానిని విస్మరించాలని పేర్కొన్నారు. 12వ పి.ఆర్.సిని వెంటనే ప్రకటించాలని, మున్సిపల్ కార్మికులందరికీ పిఆర్సి జీతాలు చెల్లించాలని, గత జులై సమ్మె కాలం జీతం వెంటనే చెల్లించాలని, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని, మరణించిన, అనారోగ్యం, రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో కుటుంబ పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఎన్.ఎం.ఆర్ బదిలీ కోవిడ్ క్లాప్ డ్రైవర్లకు రు.21000/- జీతం చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు డిఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని, పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. పై సమస్యలపై పలుమార్లు మున్సిపల్ ఉన్నత అధికారులకు, జిల్లా కలక్టరుకు విన్నవించుకోవడం జరిగిందని, ఆయన సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వ చర్యలు లేవని తెలిపారు. కావున, ఇకనైనా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా నాయకులు రెడ్డి వేణు, పట్టణ నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, ఫెడరేషన్ నాయకులు మామిడి శివ, బంగారు రాజేష్, బంగారు రవి, పి.సంతోష్, మామిడి శ్రీను, ఎన్.శివ, పాపమ్మ, ఇప్పలమ్మ, మున్సిపల్ కార్మికులు, డ్రైవర్లు, క్లాప్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు భద్రత పాటించాలి

విశాలాంధ్ర-ఎటపాక : ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. కన్నప్ప రాజు, ఎస్సై జి.అప్పలరాజు, వారి సిబ్బందితో డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్,రికార్డ్ లేకుండా ఉన్న మోటార్ సైకిల్, ఆటోలు తనిఖీ నిర్వహించినారు, వెహికల్ నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా బండి యొక్క రికార్డు ప్రాపర్ గా పెట్టుకోవాలని మద్యం తాగి వాహనాలు నడపవద్దని, హెల్మెట్ కూడా ధరించాలని కౌన్సిలింగ్ ఇచ్చారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లపై సవతి ప్రేమ

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : కూటమి ప్రభుత్వం ఆటో క్యాబ్ డ్రైవర్‌లపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి, నష్టపోయిన ప్రతి ఒక్క ఆటో, క్యాబ్ డ్రైవర్లలందరికీ సంవత్సరానికి 15,000 ఆర్థిక సహాయం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి నేడు మాట మార్చి ఆటో యజమానులకు మాత్రమే వాహనమిత్ర పథకం అమలుచేయడం సరైంది కాదని సిపిఎం పార్టీ సిఐటియు నాయకులు మండిపడ్డారు. ఆటో యజమాను లతో పాటు లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కి వాహన మిత్ర అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేశారు. డిప్యూటీ తహసిల్దార్ రత్నకుమారి వినతిపత్రం ఇచ్చారు. సాధికారిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వేలాది రూపాయలు జరిమానాలు విధించే జీవో నెంబర్ 21 రద్దు చేయాలని, రోడ్డు టాక్స్, ఫిట్నెస్ చార్జీలు, పెనాల్టీలు, రద్దు చేయాలన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ప్రకటించిన వాహన మిత్ర పథకం అమలులో పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆంక్షలు ఎత్తివేసి ప్రతి ఒక్క ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలని కోరారు.

హెచ్ఐవి /ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

విశాలాంధ్ర-కురుపాం : విద్యార్థులకు హెచ్ఐవి /ఎయిడ్స్ పై విద్యార్థులు అవగాహన పొందాలని వైడిఓ నెట్వర్క్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ బాబు సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఐవి/ఎయిడ్స్‌పైన అవగాహన కలిపించారు. వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాధికి మందులేదు నివారణ ఒక్కటే మార్గం అని చెప్పడం జరిగింది. ఈ వ్యాది 4మార్గాలు ద్వారా వస్తుందని. 1)టోయలు చేయని సూదులు, సిరాంజలు (ఒక సూదితో వేరే వాళ్ళకి పొడవడం వలన 2)పరీక్షించబడని రక్తం ధ్వరా 3)హె ఐ వి /ఎయిడ్స్ వున్నా తల్లి తండ్రి నుంచి పుట్టబోయే బిడ్డకి వస్తుంది. 3) నూటికి నూరు శాతం సురక్షితం లేని సంభోగం చేయడం వలన (అపరిచిత వ్యక్తులతో కండోమ్ లేకుండా సంభోగం చేయడం ద్వారా ఈ వ్యాది సంక్రామిస్తుంది. ఈ కార్యక్రమంలో ఏఏన్ఎమ్ పి. లక్ష్మి అవుట్ రీచ్ వర్కర్ ఏ.గీతారాణి, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారుల పర్యటన తప్ప ఫలితం శూన్యం

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అధికారుల హడావుడి పర్యటన తప్ప ఎక్కడ మాత్రం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అన్న దాఖలాలు లేవు. ఎప్పట్లాగానే గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి పూర్తిస్థాయిలో సిసి రోడ్లు గాని, కాలువలు గాని, వీధిలైట్లు గాని, త్రాగేందుకు మంచినీరు గాని దొరక్క గిరి పుత్రులు కాలం గడుపుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధి మౌలిక సదుపాయాలు కల్పనకు జిల్లాలో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం చేపడుతుంది. ఇందులో భాగంగా మండల అధికారులు వెలగవలస పంచాయతీలో పర్యటించి పలు గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసు కున్నారు. ఇటీవల ఈ పంచాయతీలో నెలకొన్న సమస్యలపై వాము పక్షాల ఆధ్వర్యంలో గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. దీంతో కదిలిన జిల్లా యంత్రాంగం మండల అధికారులను పర్యటనకు పంపించిన తప్ప సమస్యల పరిష్కారానికి కాదని తెలుస్తుంది. ఆది కర్మయోగి అభియాన్ కింద గిరిజన ప్రాంతాల పరిశీలనకు వచ్చిన అధికారులు ప్రణాళికను తయారు చేశారు. ఈ పర్యటనలో ఆర్డబ్ల్యూఎస్ జేఈ జవహర్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

విశాలాంధ్ర-సీతానగరం : నేడు సీతానగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవి ఫీడర్ నందు చెట్లకొమ్మలను తొలగించే కార్యక్రమం నిర్వహించడంచేత ఉదయం 8నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని ఏఈ శశిభూషణరావు తెలిపారు. సీతానగరం, పెదబోగిల, బుడ్డిపేట, బళ్లకృష్ణాపురం, బగ్గందొరవలస, గెడ్డలుప్పి, కొత్తవలస, బూర్జ సబ్ స్టేషన్ పరిధిలో బూర్జ, కృష్ణారాయపురం, పెదంకాలం, చినఅంకలాం, సుమిత్రపురం, కామన్నదొరవలసగ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయము ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డోకులూరులో రైతులకు శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర-జికే వీధి : గూడెం కొత్తవీధి మండలం పెదవలస సచివాలయం పరిధిలో డోకూలూరు, సంకాడ గ్రామాల్లో ఆత్మ వారి సౌజన్యం తో నానో యూరియా వాడకం పై రైతుల్లో అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందిని మండల వ్యవసాయ అధికారి డీ గిరిబాబు అన్నారు. ఆయన మాట్లాడుతూ యూరియా అధికంగా వాడడం వలన పంటల్లో ఎరువుల అవశేషాలు ఎక్కువగా ఉండి జీవజాతుల అనారోగ్య ప్రభావం ఎక్కువ అవుతుందన్నారు. రైతులు యూరియా కి బదులు నానో యూరియా వాడాలని మండల వ్యవసాయ అధికారి డి. గిరిబాబు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఆత్మ ఎటిఎం మహేశ్వరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంత అవినీతి జరిగితే ఉన్నతాధికారులు ఎందుకు మిన్నకున్నట్టు?

మాల మహానాడు సూటి ప్రశ్న

విశాలాంధ్ర-కూనవరం : మండలంలోని కూనవరం పంచాయతీ టేకులబోరు గ్రామం ఎస్సిలో కాలనీ మాల మహానాడు,దళిత సంఘాల ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో దళిత నాయకుడు కొక్కెరపాటి రవీంద్ర పాల్గొని మాట్లాడుతూ స్థానిక ఆదివాసీ సర్పంచ్ కట్టం రాజమ్మ మరణించడంతో ఉపసర్పంచ్ నుండి సర్పంచిగా ప్రమోషన్ తో వచ్చినా మల్లంపల్లి నాగ సత్య హేమంత్ గాంధీ పంచాయతీ నిధులు పూర్తిగా స్వాహా చేసి నేను స్వచమైనా వ్యక్తినని నాకేమి తెలియదు అని గౌతమ్ బుద్ధ మాటలు మాట్లాడుతున్నాడు. రాజ్యాంగంలో ఉన్న నిబంధనల మేరకు స్థానికంగా ప్రజా ప్రతినిధిగా పదవిలో ఉన్నా వ్యక్తి చనిపోతే ఆ స్థానంలో తాత్కాలిక ప్రజా ప్రతినిధి ఆరు నెలలపాటు సంబంధిత వార్డు తీర్మానంతో అధికారుల ఆదేశాలతో కొనసాగవచ్చు తర్వాత ఆ ఖాళీని సంబంధిత అధికారులకు తెలియజేసి ఎలక్షన్ జరిగే విధంగా చేసుకోవాలి. కానీ కూనవరం మండల పంచాయతీలు ఆదివాసి రిజర్వుడ్ స్థానా సర్పంచ్ కట్టం.రాజమ్మ మరణించడంతో గిరిజనేతర వార్డు మెంబెర్ ని తాత్కాలికంగా సర్పంచ్ గా సంబంధిత అధికారులు నియమించారు. నియమించి ఆరు నెలలు అయిపోయి ఇప్పటికి మూడు సంవత్సరాలు గడుస్తున్న రి ఎలక్షన్స్ ఎందుకు పెట్టలేదు? అదేవిధంగా రాజ్యాంగం నీకి విరుద్ధంగా ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఒక గిరిజన ఇతరులను మూడు సంవత్సరాల పాటు ఏ రకంగా సర్పంచిగా కొనసాగిస్తున్నారు? ఆరు నెలలలో ఎలక్షన్లు నిర్వహించకపోతే స్థానిక ఆదివాసి వార్డు మెంబర్స్ ని ఎందుకు సర్పంచ్ గా నియమించలేదు? వీటన్నిటిపై మాకు పంచాయతీ ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని అలాగే కలెక్టర్ స్థాయి అధికారులు ఎంత జరుగుతున్న సోషల్ మీడియా పత్రికల్లో తరచు వస్తున్న ఎందుకు పట్టించుకోవడం లేదు? వెంటనే విచారణ చేపట్టకపోతే పంచాయతీలో జరిగే ఆందోళన కార్యక్రమాలకు అధికారులే భాద్యత వహించాలని రవీంద్ర హెచ్చరించారు. పంచాయతీలో చేసేటటువంటి వర్కులకు సంబంధించి గ్రామ సభ నిర్వహించి గ్రామ సభలో తీర్మానం చేసి పాలకవర్గంతో సంతకాలు పెట్టి సంబంధిత వర్క్ ను లైసెన్స్ ఉన్న కాంట్రాక్టర్ కి ఇయ్యాల్సింది పోయి సామరస్యంగా వర్కులు జరిగినట్టు రికార్డు రాసుకొని అమాయకులు దళితుల పేరు మీద డబ్బులు డ్రా చేస్తున్నటువంటి దుర్మార్గమైనటువంటి దృచర్యకు వీళ్ళు ఒడిగడుతున్నారని అన్నారు. పంచాయతీ వర్కులు చేయకుండా చేసినట్టు, అక్కడక్కడ అరకొర పనులు చేసి లక్షల రూపాయలకు బిల్లు చేసుకుంటున్నటువంటి దుస్థితి ఈ పంచాయతీలో చాలా స్పష్టంగా కనబడుతుందని అన్నారు. వర్కులకు సంబంధించి తీర్మానాలు ప్రవేశపెట్టేముందు వార్డు నెంబర్లకు మీటింగ్ ఉందనే పేరుతోనే తెల్ల పేపర్ల మీద సంతకాలు పెట్టించుకుని వాళ్ళ ఇష్టను సారంగా వర్కులు చేయకుండా చేసినట్టు బిల్లులు చేసుకున్నటువంటి పరిస్థితి ఉందని, ఇది చాలా దారుణం అని అన్నారు.కూనవరం రుద్రంకోట మధ్య పడవ రేవు పాటకు సంబంధించి ఈ సంవత్సరం పాట దారుడు 44.5లక్షలు పైచిలుకు డబ్బులు చెల్లిస్తే కనీసం వాళ్లకి పంచాయతీ నుండి రసీదు కూడా ఇచ్చినటువంటి దాఖలాలు లేవు అని, లిక్విడ్ క్యాష్ రూపంలో తీసుకొని ఆ డబ్బులు ఏం చేశారో కూడా కనీసం వార్డ్ సభ్యులకు కూడా తెలవనటువంటి దుస్థితి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు మోత్కూరి వెంకన్న, పుట్టి కృష్ణార్జునరావు, భూపతి దుర్గారావు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం: ఏపీ అసెంబ్లీ సమావేశాలు గురువారం నుండి ప్రారంభమంకాగా, ఈసమావేశాలకు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర హాజరయ్యారు. పార్వతీపురం నియోజకవర్గంకు సంబంధించి పలు అంశాలపై సభలో మాట్లాడటం చేస్తానని, ముఖ్యంగా జంఝావతి సాగునీటి ప్రాజెక్టు సమస్యతో పాటు నియోజకవర్గంలోని పలు సమస్యలు ప్రస్తావిస్తానని తెలిపారు. శాసనసభ దృష్టికి పలు సమస్యలు తీసుకొనివెళ్ళి ప్రభుత్వ సహకారంతో పరిష్కారం చేయడానికి దృష్టి సారించారు.

మండల అధికారులను కలిసిన వైసిపి బృందం

విశాలాంధ్ర-జి కె వీధి : గూడెం కొత్త వీధి మండలం ఎంపీడీఓ బీవీ రమణ బాబు, ఎస్ ఐ సురేష్ ని వైసిపి బృందం వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలిసి అభినందన తెలిపారు.జీకే ఇరువురు అధికారులతో పలు ప్రజా సమస్యలు మీద చర్చించడం జరిగిందిని, అలాగే అధికారులు కూడా సానుకూలంగా స్పందించారని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, జీకే వీధి వైస్ ఎంపీపీ లోత దేముడు,దామన పల్లి ఎంపీటీసీ కొర్ర భీమరాజు,రింతాడా ఉప సర్పంచ్ మడపాల సోమేశ్ కుమార్,జీకే వీధి మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, జీకే వీధి మండల యూత్ అధ్యక్షులు కొర్ర బాబి,జీకే వీధి ఎస్టీ సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ,మండల కార్యదర్శి పాతూను లక్ష్మణ్, రింతాడా పీసా కార్యదర్శి గెమ్మెల కోటి బాబు,తదితరులు పాల్గొన్నారు.

ఆది కర్మయోగి అభియాన్‌తో గిరిజన గ్రామాలు మరింత అభివృద్ధి

విశాలాంధ్ర-కొమరాడ : ఆది కర్మయోగి అభియాన్ పథకంతో గిరిజన గ్రామాలు శతశాతం అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో ఎస్.రమేష్ అన్నారు. మండలంలో దేవుకొన, పూర్ణపాడు గ్రామాల్లో గురువారం ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమములో ముందుగా వీధులలో ర్యాలీ చేసి వీధులలో వున్న సమస్యలను గుర్తించి అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు.గ్రామాల్లో సమస్యలను గుర్తించి ముందుగా గ్రామ సభ నిర్వహించి గ్రామాల్లో కావలసిన మౌలిక వసతులు ఏమేమి ఉండాలో పరిశీలించారు రోడ్లు,కాలువలు,ప్రహరీ గోడలు, బరియల్ గ్రౌండ్‌కి రోడ్లు, ఇల్లు నిర్మాణాలు, పెన్షన్ గల వివిధ రకాల అవసరమైన పనులు గుర్తించిన గ్రామ సమావేశంలో ప్రజలకు చదివి వినిపించి పెండింగ్ పనులపై సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది కర్మయోగి అభియాన్ అనేది గిరిజన వ్యవహారాల ఒక ఉద్యమం, దీని లక్ష్య గిరిజన ప్రాంతాలలో పాలన, సేవా పంపిణీ, అభివృద్ధిని మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా గిరిజన మార్పు నాయకులకు శిక్షణ ఇచ్చి, వారికి నైపుణ్యాలను అందించడం ద్వారా గిరిజన ప్రాంతాలలో సేవలను సామాజిక సమస్యలను పరిష్కరించడం, స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం జరుగుతుందన్నారు. పథకం ముఖ్య లక్ష్యాలుసామర్థ్య పెంపుదల గిరిజన ప్రాంతాలలోని అట్టడుగు స్థాయి కార్యకర్తలు, గ్రామ-స్థాయి నాయకులకు పాలన, సమస్యల పరిష్కారం కావడం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ప్రభుత్వ పథకాలను, ముఖ్యంగా గిరిజన పథకాలను విజయవంతంగా అమలు చేయడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి కొమరాడ ప్రాజెక్టు అధికారి జి సుగుణ కుమారి డిప్యూటీ ఎంపీడీవో రాధాకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎన్జీవో సంఘ సభ్యులు టిడిపి నాయకులు హిమరక గోపి, గండి మోహనరావు వైద్య ఆరోగ్య సిబ్బంది అంగన్వాడి సిబ్బంది గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సత్కారం

విశాలాంధ్ర-ముంచంగిపుట్టు : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలో గల దారాపల్లి ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శెట్టి అనంతరావు మాష్టారుకు కించాయిపుట్టు పంచాయతీ సర్పంచ్ సీసా సుభాష్ చంద్ర గ్రామ పెద్దలు విద్య కమిటీ సభ్యులు పరశురాం సుమన్ సుందరంలు ఘనంగా జ్ఞాపికతో సత్కరించారు. బుదవారం సాయంత్రం దారపల్లి ఆదర్శ పాఠశాల లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అనంతరం మాస్టారుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడం అపూర్వ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా కించాయపుట్టు సర్పంచ్ సుభాష్ చంద్ర మాట్లాడుతూ దారాపల్లి ఆదర్శ పాఠశాలకు విధుల్లో చేరినప్పటి నుండి విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పించే విషయంలో ఎక్కడ రాజీ పడకుండా చక్కటి విద్య అందించర ని దీంతో పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఏపీఆర్ పాఠశాలలో ఏకలవ్య ఇంగ్లీష్ మీడియం మోడల్ పాఠశాల సీట్లు దక్కించుకోవడంతో ఉత్తమ అవార్డు దక్కిందని. దీంతో దారాపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చిన అనంతరావు మాస్టర్ కి ప్రత్యేక అభినందన తెలియజేశారు. ముందు ముందు చక్కటి విద్య పిల్లలకు నేర్పించి రాష్ట్రస్థాయిలో సైతం ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు దక్కించుకోవాలని కోరుతున్నామని సర్పంచ్ అన్నారు. మంచి విజయాలు తో పాఠశాల కు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.వైవిద్యమైన బోధనలతో పిల్లలను తీర్చిదిద్దడంలో అనంతరావు మాష్టారు సేవలు గర్వనీయమని వారు కొని యాడారు. ముఖ్యంగా మండలం నుండి పాఠశాల నుంచి తొమ్మిది మంది విద్యార్థులు గత ఏడాదిలో ఏకలవ్య, ఎపి రెసిడెన్షియల్ కు జరిగిన పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను సాధించి ఉత్తీర్ణులయ్యారు .వీరి ప్రతిభ కు కారకమైన అనంత మాష్టారును ఈ అరుదైన పురస్కారం దక్కించుకోవడంతో పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానో ఉపాధ్యాయుడు ఎస్.రాజు ఏం.రామకృష్ణ వి.హరిశ్చంద్ర సన్మాన గ్రహీతను ప్రసంశించారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ముడుపుల పూజలకు అనూహ్య స్పందన

విశాలాంధ్ర-సీతానగరం : స్థానిక శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో గురువారంనాడు జరిగిన ముడుపుల పూజలకు పెద్దఎత్తున భక్తజనం తరలివచ్చారు. వివిధ ప్రాంతాలనుండి వేకువజాము నుండే భక్తులు భక్తిశ్రద్ధలతో తరలిరాగ ఆలయం కిటకిటలాడినది. శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్న ముడుపుల పూజలకు అనూహ్య స్పందన లభిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, టీటీడీ ధర్మకర్త కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పాత భక్తులతోపాటు కొత్తగా 500మంది భక్తులు ముడుపులు కట్టినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు రామానుజా చార్యులు తెలిపారు.గత వారం, ఈవారం కలిపి 1050మంది ముడుపులు కట్టినట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు తెలిపారు.ఉదయం నుండి రాత్రి భక్తులు ముడుపుల పూజలను నిర్వహించడంతో పాటు భక్తులుతెచ్చిన వివిధ రకాల పూలదండలు,పూలు స్వామివారికి పెద్ద ఎత్తున అలంకరించిన తీరు అందరిని ఆకట్టుకుంది. ప్రతీగురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలోజరుగుతున్న ముడుపుల పూజలకు పాతభక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి కొత్త భక్తులు రాకతో అనూహ్య స్పందన వస్తుందని తోటి భక్తులు తెలిపారు. వివిధ ప్రాంతాలనుండి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులుభక్తిశ్రద్ధలతో, ఉపవాసాలతో స్వామివారికి పూజలు చేసి, స్వామివారు ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నారు. నిర్మలమైన మనస్సుతో పాల్గొని పూజలుచేస్తూ 27సార్లు ప్రదక్షిణలను పూర్తిచేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి తరలి వెళ్తున్నారు. తొమ్మిది వారాలపాటు ముడుపులు పూజలు చేయడంతో తమకు మానసిక ప్రశాంతత, మంచి కలుగుతుందని భక్తులు తెలిపారు. ఈపూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త దంపతులు చెలికాని వెంకట గోపాలకృష్ణ భారతిలతోపాటు భక్తజనం పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులతో పాటు కె.మురారి, పవన్ కళ్యాణ్ ఆచార్యులు, విహారి, ప్రసాద్,మనోజ్, శ్రీకర్లు తదితర అర్చకులు పాల్గొని భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రంలో దళితులను అణగదొక్కే పాలన సాగుతోంది

రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం దళిత సమాజాన్ని అనగ ధోక్కుతూ వారి బతుకులను చిన్నాభిన్నం చేస్తూ జీవితాలను దయనీయ స్థితికి దిగజారుస్తుందని వైయస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే టీ జే ఆర్ సుధాకర్ బాబు ఆరోపించారు. పాలన అందరికీ అందాలి, సంపద అందరికీ అందాలనే ఉద్దేశంతో వైయస్ జగన్ మోహన్ రెడ్డి గత ఐదేళ్లు పరిపాలించారని అలాంటిది నేడు చంద్రబాబు లక్ష కోట్లు ఒక రాజధానికి పెడితే మిగిలిన ప్రజలు ఏం కావాలి, మళ్ళీ వచ్చిన ప్రభుత్వాలు ఆ లక్ష కోట్లు అప్పు తీర్చే పనిలో ఉండాలా అంటూ ఆయన ప్రశ్నించారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశం జిల్లా పార్టీ అధ్యక్షులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత సమాజానికి ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా న్యాయం జరగాలంటే మళ్ళీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడం ఒక్కటే మన ముందున్న ఏకైక కర్తవ్యం అని అందుకు మనందరం సమిధులమై ప్రజా క్షేత్రంలో నిరంతర పోరాటం చేస్తూ రాబోయే ఎన్నికల్లో జగన్ అన్నను సీఎంగా గెలిపించుకు తీరాలని పిలువు నిచ్చారు. మాజీ ఉప ముఖ్యమంత్రిలు పీడిక రాజన్నదొర, పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్సీ విక్రాంత్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి,అలజంగి జోగారావు, జిల్లా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్తురాజు, మాజీ టిట్కో చైర్మన్ జే ప్రసన్నకుమార్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సర్వీశెట్టి శ్రీనివాసరావు, నాలుగు నియోజకవర్గాల ఎస్సీ సెల్ అధ్యక్షులు, కార్యదర్శులు, మండల అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జయమని, జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాబుజీ నాయుడు, జడ్పీటీసీలు మామిడి బాబ్జీ అలజంగి రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి మావిడి శ్రీనివాసరావు, జిల్లా ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఎస్సీ అనుబంధ విభాగాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శిలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వరికి కీలక దశ... పొట్ట దశ

- తప్పనిసరిగా యూరియా పోటాస్ చాలా అవసరం
- అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు



విశాలాంధ్ర-పాలకొండ/వీరఘట్టం : పొట్ట దశలో 35కిలోల యూరియా 15 కిలోల పొటాష్ వేయాలని రైతు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1/2 ఎకరాలున్న 15 ఎకరాలున్న పాసు పుస్తకానికి 1 యూరియా బస్తా కంటే ఎక్కువ ఇవ్వందని కలెక్టర్ ఆదేశాలిచ్చారని యూరియా పంపిణీ చేసిన మండల వ్యవసాయ శాఖాధికారు లంటున్నారు. యూరియా కొరత లేదని డిమాండ్ కన్నా సప్లై ఉందని రైతులు ఆందోళన పడవద్దని, మంత్రులు, కలెక్టర్లు, జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎండలోను వానలోనూ 500 కూలీ వదలుకొని క్యూలైనులో నిలబడితే 1 యూరియా బస్తా ఇవ్వడంతో రైతు కూలీలు, నిరాశ చెంది 500 రూపాయలు కూలీ చేసుకుంటే బ్లాకులో బస్తా 400 నుంచి 450 వరకు దొరుకు తుండటంతో కూలీ పని చేసుకుంటే రెండు బస్తాలు వస్తాయని వెనుతిరుగుతున్నారు. వ్యవసాయాధికారులు ఒక బస్తా ఇవ్వడం వల్ల ప్రైవేటు వ్యాపారులు వద్ద 4 వందల నుంచి 500 వరకు రైతు కొనుగోలు చేయడం వ్యవసాయాధికారులు వారికి లబ్ధి చేకూర్చడమే కౌలుదారులకే మొండి చేయచూపిస్తున్న వ్యవసాయ శాఖ గ్రోమోర్‌కు వచ్చినా, సొసైటీలకు, రైతు భరోసా కేంద్రాలకు వచ్చిన కోటాలో 50 నుంచి 100 బస్తాలు వరకు రాత్రికి రాత్రే మాయం ఎరువులకు కొరత లేదు, అద్నెర్య పడవద్ద బఫర్ నిల్వలు ఉన్నాయి అని చెప్పడం చూస్తే అందరూ వైష్ణవుల్కైతే ఉట్టిమీదున్న ఎండు చేపలకూర ఎలా మాయమైందన్న నానుడి జ్ఞాపకం వస్తుంది అనిఅభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎద్దేవ చేశారు. వరికి కీలకదశ చిరు పొట్ట దశ. ఈ దశలో తప్పనిసరిగా యూరియా 35 కిలోలు, పొటాష్ 15 కిలోలు తప్పకుండా వేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాని వ్యవసాయ అధికారులు ఎన్ని ఎకరాలున్న 1 బస్తా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కౌలు రైతులు వస్తే వారికి ఇవ్వడం లేదు. గత ఐదేళ్లుగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతు సంఘాలు మొరపెట్టుకున్నా రెవెన్యూ శాఖ చర్య తీసుకోవడం లేదు. టెక్కలిలో ఒక రైతు తను ఐదేళ్లుగా భూమిని కౌలు చేస్తున్నానని తనకు యూరియా ఇప్పించాలని పట్టుపట్టి కూర్చుంటే ఆర్డీఓ క్షేత్ర స్థాయికి వెళ్లి పోలాన్ని పరిశీలించి పక్క రైతులను వాకబు చేసి వారు అవునంటే 1 బస్తా శాంక్షన్ చేశారు. తాము రైతు బిడ్డలమని రైతు సమస్యలు తెలుసునని ఎన్నికల్లో హెూరెత్తి ప్రసంగాలిస్తున్నారు. కాని అతను తన పొలాన్ని కౌలుకిచ్చి ఆ ఇచ్చిన కౌలుతో పబ్బం గడుపుతున్నాడు. భూమి లేని రైతు కూలీ తమకు తిండి కన్నా గింజలు సరిపోతాయన్న ఆశతో కౌలుకు తీసుకొని తన కుటుంబాన్ని పోసించుకుంటున్నాడు. అటువంటి వారు జిల్లాలో 40 శాతం మంది ఉన్నారు. వారి కౌలు కార్డు మంజూరు చేయాలంటే భూ యజమాని అయిఉండాలి అందుకు అనుమతించకపోవ్వడంతో, రైతులు, బ్యాంకు రుణమందక ఎరువులు దొరక్క కౌలు రైతులు దుర్భర జీవితం గడుపుతున్నాడు. వారికివ్వాల్సిన ఎరువులు ఇవ్వక, భూమున్న ఎకరాపైన ఉన్న రైతుకు ఇవ్వక వచ్చిన ఎరువులు ఏమవుతున్నాయి అందరూ వైష్ణవుల్కైతే ఉట్టిమీదున్న ఎండు చేపలు కూర ఎలా మాయమయుండి. వారికే తెలియాలి. సాగునీటి సౌకర్యం లేనందున పాలకొండ ప్రాంతంలో 60 శాతం స్వల్ప, మధ్య కాలిక వరి రకాలను సాగు చేస్తున్నారు. ఈ రకాలన్ని చిరు పొట్ట దశకు చేరుకున్నావి. ఈ సమయంలో ఎరువులు వేయకపోతే దిగుబడులు తగ్గి రైతు నష్టపోయే పరిస్థితి ఉంది. వ్యవశాయ శాస్త్రవేత్తలు ఈ దిశలో యూరియా 35 కిలోలు, పొటాష్ 15 కిలోలు వేయాలని సిఫార్సు చేస్తున్నారు.కాని మండల వ్యవసాయ శాఖ ఎన్ని ఎకరాలున్న ఒక బస్తా ఇమ్మని ఆదేశాలున్నాయని 1 బస్తా యూరియా సరఫరా చేస్తున్నారు. మిగిలిన పొలాలకు యూరియా వేయడానికి బ్లాకు మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే రైతులకు ఎరువులు ఇవ్వని వారు రబీకి పుష్కలంగా ఎరువులు సరఫరా చేస్తామనడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే. సెప్టెంబరు చివరిలోగా ఎరువులు సరఫరా చేస్తేనే ఫలితముంటుంది. తరువాత ఇచ్చినా ప్రయోజనం లేదు. ఎందుకంటే సాగునీరుంటేనే రబీ వేయగలరు. అటువంటప్పుడు రైతు యూరియాను ఏమీ చేసుకుంటాడు.యూరియా తగ్గిస్తే బస్తాకు 800 ఇస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారు. ఒక యూరియా బస్తాకే కేంద్రం 1700 రూపాయలకు పైగా సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన 900 రూపాయల పరిస్థితి ఏంటి. కౌలు భూములు చేస్తున్న రైతు పరిస్థితి ఏంటని పాలకులు ఇప్పటికైనా స్పందించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి పంట రుణ సౌకర్యం కల్పించాలని ప్రసాదరావు కోరుతున్నారు.

బీసీల అభివృద్ధికై ఐక్యతతో ముందుకెళ్దాం

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: బీసీల అభివృద్ధికై ఐక్యతతో ముందుకు వెళ్దామని పార్వతీపురం మన్యం జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆవాల రామకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని జనాభాలో బీసీలు సంఖ్యాపరంగా అధికంగా ఉన్నప్పటికీ రిజర్వేషన్ల ఆశల్లో ఇప్పటికే ప్రభుత్వాలు బీసీ కులాలను వెనక్కి నెట్టేస్తున్నాయన్నారు.బీసీల పరిరక్షణకు బీసీ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రంలో 60 శాతం జనాభా ఉన్న బీసీలకు చట్టసభల్లో ను, ప్రభుత్వ విభాగాల్లోనూ కేవలం 40 శాతం మాత్రమే రిజర్వేషన్లు కేటాయింపు చేయటం అన్యాయమని పూర్తి సాధనకు బీసీ సంఘం పోరాటం చేస్తుందన్నారు.నాపై నమ్మకంతో రాష్ట్ర బీసీ సంఘ అధ్యక్షులు కేశన శంకరరావు, యువజన అధ్యక్షులు క్రాంతికుమార్ నాకు జిల్లా బాధ్యతలు అప్పగించడం ఆనందదాయక మని వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సంఘ అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా చిత్తశుద్ధితో కృషి చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పార్వతిపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి సీరాపు వెంకట మహేష్, యువజన విభాగం అధ్యక్షులు ముగడ జగన్మోహనరావు పాల్గొన్నారు.

వేదికలో కూటమి పార్టీల సమావేశం



విశాలాంధ్ర-జీకే వీధి : మండల కేంద్రంలోని స్థానిక కళ్యాణ మండపంలో శనివారం తెదేపా, భాజపా, జనసేన పార్టీల మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో 'సామాన్య వేదిక" సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు హాజరుకావాలని ఆహ్వానించారు.ఈ సమావేశానికి జడ్పీటీసీ, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ, మాజీ ఎంపీటీసీ, సర్పంచులు, మాజీ సర్పంచులు,వైస్ సర్పంచులు, వార్డు సభ్యులు,బూత్ కమిటీ, పంచాయతీ కమిటీ సభ్యులు మరియు పార్టీలకు చెందిన తాజా, మాజీ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, హాజరుకావాలని కూటమి అధ్యక్షులు తెదేపా పోత్తూరు కొండలరావు, భాజాత మండల అధ్యక్షులు కాకురు శేఖర్, జనసేన మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు కలసి నిర్వహించనున్నారు. మీ రాకే మాకు ఆదరణ, మీ సమక్షమే మాకు శక్తి అనే నినాదంతో జరుగుతున్న ఈ సమావేశానికి కూటమి కుటుంబ సభ్యులు అందరినీ ఆహ్వానిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇతర కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

-ముప్వా శ్రీనివాస్, దొంతు మంగేశ్వరరావు

విశాలాంధ్ర-ఎటపాక : ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి ముప్వా శ్రీనివాస్, ఎటపాక వైస్ యంపిపి దొంతు మంగేశ్వ రరావు అన్నారు. గురువారం అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎటపాక మండల కేంద్రంలో గల యంపిడిఓ మీటింగ్ హాల్ నందు పోషణ మాసం అనే కార్యక్రమాన్ని ఎటపాక చిల్డ్రన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సిడిపిఓ)పి అరుణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ముందుగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు చేయడం జరిగింది. అంగన్వాడీ కార్యకర్తలు తయారు చేసిన పిండి పదార్థాలను, కూరగాయలు ప్రదర్శించడం జరిగింది.అనంతరం జంకు ఫూడ్ తినడం వల్లనా కలిగే ఆరోగ్య సమస్యల గురించి నాటకం అంగన్వాడీ కార్యకర్తలు నాటక ప్రదర్శన చేయడం జరిగింది.పోషణ మాసం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి ముప్వా శ్రీనివాస్, వైస్ యంపిపి దొంతు మంగేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు పాటి చలపతిరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మారసు గంగాధరరావు, ఎటపాక తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎటపాక యంపిడిఓ ఇ ప్రేమ సాగర్, యం ఇ ఓ సరియం రాజులు, వెలుగు ఏపిఎం రావి భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ ద్వారా అందించే పోషకహారని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణీ స్త్రీలు గర్భం దాల్చిన నాటి నుంచి పిల్లలకు 6సంవత్సరాల వయస్సు వచ్చే వరకు అంగన్వాడీ కార్యకర్తలది కీలక పాత్ర అని, గర్భిణీలు ప్రతి ఒక్కరు ఇళ్లలో పెంచే కూరగాయలు,ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యలు తీసుకోవాలి అని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ పావని, రాధ, అంగన్వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలి

విశాలాంధ్ర-దేవీపట్నం : షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించి తక్షణమే ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్,భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర ఉప అధ్యక్షులు ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఏపీ సీఎం ఎన్నికల ముందు ఆదివాసీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలుచేయాలని, షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన 5వ, షెడ్యూల్డ్ భూ భాగంలో ఉన్న ఆదివాసీల హక్కులు చట్టాలు, ఉద్యోగ, ఉపాధి,అభివృద్ధి, సంక్షేమం పటిష్టంగా అమలు చేయాలని, 2025 మెగా డీఎస్సీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయటంతో షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వాస్తవానికి షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉపాధ్యాయ నియామకాల ఆదివాసీ పట్టా భద్రులతోనే భర్తీ చేయాలని, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని, ఐటీడీఏ ద్వారా ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని, వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలతో వంద శాతం భర్తీ చేయాలని, ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, షెడ్యూల్డ్ ప్రాంత హక్కులు,చట్టాలు పటిష్టంగా అమలు చేయకుండ ఉల్లంఘించిన ప్రభుత్వాలకు ఆదివాసీలందరూ భవిష్యత్‌లో ఓటు బ్యాంక్‌తో తగిన గుణపాఠం చెబుతారన్నారు హెచ్చరించారు.

ఈనెల 22న మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-సీతంపేట : మండలం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఈనెల మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించబడును సూపరెంటెంట్ బి శ్రీనివాస్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ప్రారంభించనున్న "స్వస్థ నారి శక్తి పరివార్ అభియాన్" కార్యక్రమం అన్నీ ప్రభుత్వ ఆసుపత్రుల నందు తేదీ 17.09.2025 నుండి 02.10.2025 నిర్వహించబడును. దీనిలో భాగంగా మన యొక్క ప్రాంతీయ ఆసుపత్రి సీతంపేట నందు సోమవారం తే: 22.09.2025 దీన మెగా మెడికల్ క్యాంపు నిర్వహించబడును. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మహిళల కోసం ఎన్ సి డి స్క్రీనింగ్-రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, స్తన క్యాన్సర్ & గర్భాశయ ముఖ క్యాన్సర్, క్షయవ్యాధి (టీబీ) స్క్రీనింగ్, రక్తహీనత (ఎనీమియా) స్క్రీనింగ్, యువతులు & మహిళల కోసం కౌన్సెలింగ్ సేవలు , సికిల్ సెల్ స్క్రీనింగ్ & కౌన్సెలింగ్ సేవలు, మహిళలకు గర్భిణీ స్త్రీల కోసం గర్భధారణ సంరక్షణ (ఏఎన్‌సి) తనిఖీలు-హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు సహా, గర్భధారణ సమయంలో ఆహారం మార్ సంరక్షణపై కౌన్సెలింగ్, తల్లి-శిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డుల పంపిణీ, ప్రతిరక్షణ సేవలు (ఇమ్యూనిజషన్ సర్వీసెస్)-పిల్లలకు అందించబడును. ఆరోగ్య అవగాహన సదస్సులు -మానసిక ఆరోగ్యం & పోషణపై, యువతులు మరియు మహిళల కోసం ప్రత్యకం. పోషణ కౌన్సెలింగ్, వెల్‌నెస్ సెషన్లు, మెగా రక్తదానం శిబిరం, ఆయుష్మాన్ భారత్ (పీఎంజె) నమోదు, నిక్షయ మిత్ర వాలంటీర్ల నమోదు, ఆయుష్ క్లినిక్, కౌమార బాలికలలో వచ్చే ఋతు సమస్యలపై ప్రత్యేకమైన అవగాహన సదస్సు నిర్వహించబడును అని ప్రజలు ఈ క్యాంపెయిన్ సద్వినియోపరుచుకోవాలని ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ శ్రీనివాస్ తెలిపారు.

విశాలాంధ్ర
పేజీ : 4
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
శుక్రవారం 19, సెప్టెంబరు 2025

ఎంపీడీవోని మర్యాదపూర్వకంగా కలిసిన కూటమి నాయకులు

విశాలాంధ్ర-జికే విధి : గూడెం కొత్త వీధి మండలం నూతనంగా వచ్చినటువంటి ఎంపీడీవో బి వి రమణబాబు ని కూటమి నాయకులు మండల పరిషత్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసే దుస్సాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలోజీకే వీధి మండల అధ్యక్షులు పొత్తూరు కొండలరావు జనసేన పార్టీ మండల అధ్యక్షులు కోయం బాలరాజు మరియు బిజెపి మండల అధ్యక్షులు కాకూర్ శేఖర్ రావు, వంచుల పంచాయతీ అధ్యక్షులు కూడా మధు కుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ముట్టడం సర్బన్నదొర, జనసేన పార్టీ అధ్యక్షులు బత్తుల మార్క్, గొర్ల వీర వెంకట్ ఎగ్జిక్యూట్ మెంబర్, జుర్ర వెంకటలక్ష్మి, మండల అనుబంధ కమిటీ మహిళా అధ్యక్షురాలు, ముక్కల మహేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

హాట్ బజార్‌ని ఐటీడీఏ పీఓ సందర్శన

విశాలాంధ్ర-హుకుంపేట : మండలం గల సూకూరు పంచాయతీ నడుమువీధి, తీగలవలస పంచాయతీ తీగలవలస గ్రామం నిర్మిస్తున్న హాట్ బజార్‌ని గురువారం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిణి తిరుమని శ్రీపూజ సందర్శించారు. ఈ సందర్భం గా సంబంధిత అధికారులతో ఆమె మాట్లాడుతూ హాట్ బజాజ్ నిర్మా ణానికి ఎంత ఖర్చు చేశారు, ఎంత విస్తీర్ణంలో భవనం నిర్మిం చారు, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. గ్రామంలో డ్వాక్రా మహి ళలతో మాట్లాడి వాళ్లకి హాట్ బజార్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె అన్నారు. గిరిజన ఉత్పత్తులు అటవీ ఉత్పత్తులు ఇకపై వాళ్ల గ్రామంలోనే అమ్ము కోవచ్చు ని ఆమె తెలిపారు. గ్రామ సమస్యల ను అడిగి తెలుసు కున్నారు. అనం తరం తీగల వలస గ్రామం అంగన్ వాడి కేంద్రాన్ని సందర్శించి బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అంగన్వాడీ చిన్నారులకు నాణ్యమైన పోషక ఆహారాలు అందించాలని ఐసిడి ఎస్ సిబ్బందికి ఆదేశించారు. అంగన్వాడి భవనాన్ని పూన్నారా నిర్మాణం చేయడానికి అంచనా వేయమని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈకె ధ్రువకుమార్, డిఈ కే వేణుగోపాల్, సుకూరు సర్పంచ్ ధనసాని సత్యవతి, తీగలవలస సర్పంచ్ బేసు , వెలుగు ఏపీఎం అప్పయ్యమ్మ, సుకూరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్ నిరంజని, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడే యూరియా పంపిణీ

సొసైటీ అధ్యక్షులు బుర్లె హరిబాబు

విశాలాంధ్ర-అడ్డతీగల : మండల కేంద్రమైన అడ్డతీగల సొసైటీ కార్యాలయం వద్ద యూరియా పంపిణీ శుక్రవారం చేయడం జరుగుతుందని సొసైటీ అధ్యక్షులు బూర్లె హరిబాబు తెలిపారు. రైతులకు 25 టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉంచామని ఆయన తెలిపారు. ప్రతి రైతు తమ ఆధార్ కార్డు, పాస్‌బుక్, 1బి జిరాక్స్ కాపీలు తెచ్చుకోవాలని ఆయన తెలిపారు. ప్రతి రైతుకు ఒక బస్తా యూరియా ఇవ్వడం జరుగుతుందని, బస్తా ఒక్కంటికి 270 రూపాయలు మాత్రమే చెల్లించాలని ఆయన తెలిపారు.

స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర - అడ్డతీగల : మండల కేంద్రమైన అడ్డతీగలలో ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ స్కూల్‌లో 'స్వచ్ఛత పక్వాడ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అడ్డతీగల ఎస్సై బి.వినోద్ పాల్గొన్నారు. గ్రామ పురవీధుల్లో భారీగా ర్యాలీ నిర్వహించారు అనంతరం స్థానిక దేవి గుడి సెంటర్లో 456 మంది విద్యార్థులతో వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుంకు పెద్దకాపు

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, భారీగా పాల్గొన్న గ్రామస్తులుచే స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రిన్సిపల్ ప్రభాకర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనారోగ్య సమస్యలు, పొడి-తడి చెత్త గురించి, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం గురించి, సామజిక సమస్యలు గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. అలాగే అడ్డతీగల బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల శుభ్రత, నీరు పొదుపు చేయుట, మొక్కలు నాటుట, ఎండిఎం గదులు తరగతి గదులు శుభ్రం చేసుకొనుట, విద్యార్థులు మరుగుదొడ్లు సుభ్రముగా ఉండేటట్లు చూసుకొనుట, పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. ఆనంద్ బాబు, వార్డెన్ ఎస్.కృష్ణ ఉపాధ్యాయులు ఎర్రమరెడ్డి, రామారావు, అశోక్, వెంకటరమణ, సిఆర్పిలు పాల్గొన్నారు. గురుకుల పాఠశాల కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.డి వల్లిరెడ్డి. పి.ఈ.టి. విద్యా కమిటీ యాక్టివ్ మెంబర్ అడపా లోవరాజు, పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసమే స్వస్థ నారి సశక్త పరివార్ అభియాన్

- చింతపల్లి ఏరియా ఆసుపత్రి నందు స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం
- జిల్లా ఆసుపత్రుల అభివృద్ధి అధికారిని డాక్టర్ నీలవేణి



విశాలాంధ్ర-చింతపల్లి : ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం భారత ప్రభుత్వం సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు స్వస్థ నారి సశక్త పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం (అంటు వ్యాధి కాని వ్యాధుల కోసం) మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చెయ్యడానికి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చెయ్యడం జరుగుతుందని అందులో భాగంగా స్థానిక ఏరియా ఆసుపత్రి నందు ఈనెల 23న ప్రత్యేక వైద్య నిపుణులతో శిబిరం నిర్వహించడానికి ఏర్పాటుచేసినట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిని, స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో మహిళా వైద్య నిపుణులు, కళ్ళు, చెవి, ముక్కు, గొంతు, చిన్న పిల్లల వైద్య నిపుణులు, జనరల్ సర్జరీ వైద్య నిపుణులు పాల్గొంటారన్నారు. కనుక ఈ క్రింది తెల్పిన స్క్రీనింగ్స్ చేస్తారని, మరియు కిడ్నీ, లివర్, హిమోగ్లోబిన్ వంటి ఇతర రక్త పరీక్షలు కూడా చేయబడునన్నారు. రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ లతోపాటు మహిళల మెరుగైన ఆరోగ్యం కోసం ఈ వైద్య ఆరోగ్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అదే క్రమంలో పోషణ అభియాన్, ఈట్ రైట్ (సరైన ఆహారం తీసుకోవాలి), తల్లి బిడ్డ సేవలు, వయోవృద్ధుల, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలతోపాటు అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహించబడునని ఈ సదవకాశాన్ని ముఖ్యంగా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-ముంచంగిపుట్టు : మండల పరిధిలోగల ఏనుగురాయి పంచాయతీ కొండపడ వనబసింగి పంచాయతి లుంగపుట్టు గ్రామాలలో పొలం పిలుస్తోంది. కార్యక్రమం ఏర్పాటు చేసి రైతులకు రసాయన ఎరువులు దూరంగా ఉండి ప్రకృతి వ్యవసాయం తీసుకోవాలని అవగాహన కార్యక్రమం నిర్వహించమని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.మురళికృష్ణ అన్నారు. గురువారం ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ రాగులు వేసే గ్రామాలలో రైతులకి రసాయనిక ఎరువులు వాడకం తగ్గించలని ప్రకృతి వ్యవసాయం ఏ విధంగా ఉపయోగించుకోవాలో అనేదానిపై ఘన జీవామృతం ద్రవజీవామృతం వేప కషాయం వంటివి పిచికారి పొలానికి ఏ విధంగా వేసుకోవాలి అని తయారుచెసి గిరిజన రైతులకు చూపించమని ఆయన అన్నారు.రసాయనిక ఎరువులు వాడకం వలన కలిగే నష్టాలను మొక్కలకి అవి ఏ విధంగా హాని చేస్తాయో భూమిలో ఉండే సూక్ష్మజీవులు రసాయనక ఎరువులు వాడటం వలన నశించిపోతయని వివరించారు.దీంతో భూమిలో సారం తగ్గిపోయి సహజంగా లభ్యమయ్యే పోషకాలు మొక్కలకి అందకపోవటంతో మొక్కల సరిగ్గా పెరగక వలన దిగుబడులు తగ్గిపోయి భూమి కూడా రసాయన ఎరువులు వాడకం వలన వలన భూమి పై పొర పూర్తిగా హానికరం గా మారుతుందని రైతులకు అవగాహన కల్పించమని ఆయన అన్నారు. రైతులు ఎక్కువగా సహజ సిద్ధంగా దొరికే ఆవు పేడమూత్రం తో తయారు చేసుకున్న ఘన జీవామృతంఎక్కువ పొలానికి వాడుకోవాలని అప్పుడు రైతులకు అధిక దిగుబడితో పాటు ప్రతి రైతు ఆరోగ్యవంతులుగా ఉండే అవకాశం ఎక్కువగా ఉందని సూచించారు. ఆవు పేడ గెత్తం వంటివి రాగులు వరిపసుపు వంటి పంటలకు ఎక్కువగా వాడుకోవాలని ప్రకృతి వ్యవసాయం చేసి పండించే పంటలకు ఆర్గానిక్ సర్టిఫికేసన్ పండిన ప్రతి పంటకు ఎక్కువ ధరలకు రైతులు సంఘాలగా ఏర్పడి అధిక ధరలకు రైతులు పండించినపంటలు అమ్ముకోవచ్చు అని ఆయా గ్రామాల గిరిజన రైతులకు పలు సూచనలు సలహాలు అందించమని వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి పాత్రుడు సిబంది సూర్యనారాయణ ప్రవీణ్ సత్యనారాయణ ఆయా గ్రామ ల రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలతో మహిళా శక్తి-కుటుంబ శక్తి

విశాలాంధ్ర-అడ్డతీగల : "ఆరోగ్యవంతమైన మహిళలు శక్తివంతమైన కుటుంబం, "సేవే సంకల్పం-దేశభక్తి ప్రేరణ" అనే నినాదంతో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా నిర్వహించిన మెడికల్ క్యాంపులో బీజేపీ నేత ఈరోజు స్వప్న కుమారి మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో, ఏరియా హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఈ ఆరోగ్య శిబిరాలు జరుగుతున్నాయని తెలిపారు. భారతి మాట్లాడుతూ సమీప గ్రామాల మహిళలు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని కోరారు. రేపు వైరామవరంలో శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ సతీష్ మాట్లాడుతూ లి"స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్"లిలో భాగంగా మహిళలు, కిశోర బాలికలకు స్క్రీనింగ్ టెస్టులు జరుగుతాయని, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ప్రత్యేక పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ మోమినా మాట్లాడుతూ గర్భిణీలు వెంటనే పరీక్షలు చేయించుకోవడం వల్ల తల్లి-శిశువులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. పిల్లలకు టీకాలు, గర్భిణీ స్త్రీలకు ఏఎంసీ చెక్‌అప్, సికిల్ సెల్ అనీమియా పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్టు పీడియాట్రిషన్ డాక్టర్ హర్ష తెలిపారు. అలాగే రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం పై ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు కౌన్సిలర్ నారే వాసు చెప్పారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృ వందన యోజనలో నమోదు కార్యక్రమం జరుగుతోందని, డాక్టర్ క్రాంతికిరణ్ మాట్లాడుతూ ఎంసిపి కార్డు, ఆయుష్మాన్ కార్డు, వయోవందన కార్డు, సికిల్ సెల్ కార్డు ద్వారా వైద్య సదుపాయాలు మరింత చేరువ అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్తమిక్ ఆఫీసర్ వెంకటరావు, కుమార్, ఆయుర్వేద వైద్యులు రేష్మ, ఊహ, సునీత, జానకి, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, రాజేష్, దేవుడు, రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాలో పాల్గొన్న నాయకులపై కేసులు నమోదు హేయమైన చర్య

విశాలాంధ్ర-హుకుంపేట : ఈనెల 15న హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా జరిగిన మహాధర్నాలో పాల్గొన నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేయడం హేయమైన చర్య అని, హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ వ్యతి రేక పోరాట కమిటీ కో-కన్వీనర్, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల క్రిష్ణరావు అన్నా రు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండ లం లో గల బూర్జ పంచాయితీ మజ్జివలసలో ప్రభుత్వం అక్రమంగా చేపడుతున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్నీ వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ పిలుపు మేరకు 15వ తారీకు చేపట్టిన మహా ధర్నా కార్యక్రమానికి మద్దతుగా పాల్గొన్నా ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకులు పి అప్పలనర స, అనంతగిరి జేడిపిటిసి గంగరా జు,ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి బలదేవ్, పోరాట కమి టీ కో-కన్వీనర్ టి క్రిష్ణరావు ల పై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన అన్నారు. కార్యక్రమం ముందు పోలీసులు అనుమతి తోనే మహాధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. శాంతియుతంగా చేపట్టే నిరసన కార్యక్రమానికి ఒకపక్క అనుమతులు ఇచ్చి, మరోపక్క నిరసనలో పాల్గొనే ఆదివాసులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. బాధిత గ్రామాల నుండి తరలివ స్తున్న జనానికి ఎక్కడికక్కడ అడ్డుకొని భయభ్రాంతులకు గురి చేశారని ఆయన వాపోయారు. శాంతి భద్రతాలు కాపాడవలసి నవారే అశాంతిని నెలకొల్పుతు న్నారు. గిరిజన గ్రామాల్లో రాత్రివే ళల్లో డ్రోన్లు తిప్పేవారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలనీ గ్రామస్తులు పిర్యాదు చేస్తే ఇప్పటికీ చర్యలు తీసుకోనీ పోలీసులు తిరగే సి ఆదివాసీలపై కేసులు నమోదు చేయడం పోలీసుల తీరుకు నిదర్శం అన్నారు. తక్షణమే ఆదివాసీ నాయ కులపై నమోదు చేసిన అక్రమ కేసులు ఎత్తివేయాలనీ వారు డిమాండ్ చేశారు.